నిజాయితీ



నిండు గర్భిణిలా ఆపసోపాలు పడుతూ వచ్చిన రోడ్ రవాణా సంస్థ బస్సు బస్టాండ్‌లో ఆగింది. కిటకిటలాడేట్లు వచ్చిన జనం దిగటానికి, అప్పటిదాకా బస్సుకోసం ఎదురుచూస్తున్న జనాలు బస్సెక్కటానికి ఏక కాలంలో చేసే ప్రయత్నం చిన్నపాటి రణక్షేత్రంగా మారిపోయింది.

దిగేవాళ్లు నెట్టుకుంటూ దిగుతున్నారు. ఎక్కేవాళ్లు త్రోసుకుంటూ ఎక్కుతున్నారు. మరికొంతమంది కిటికీల్లోంచి దూరుతున్నారు. ఇంకొందరు తమ చేతిలోని సంచులు, రుమాళ్లు లోపలికి వేసి సీట్లు రిజర్వు చేసుకోసాగారు.

ఎలాగొలా ఆ రణక్షేత్రంలోంచి బయట పడి, ఉసూరుమంటూ నిట్టూర్చాడు కాకి వేంకటాచలపతి. జేబులు, సంచులు తడిమి చూసుకొని... అన్నీ సరిగా ఉన్నట్లు తలాడించుకుని, బస్టాండ్ నుండి బయటపడ్డాడు.

దగ్గర్లోని ఓ సుమారైన పల్లెటూర్లో కాఫీ, టిఫిన్ హోటలుకు యజమాని అయిన కా.వే.చ, హోటల్ సామాన్లకని టౌనుకొచ్చాడు. కూరగాయల మార్కెట్ వైపు నడక సాగించాడు.

అప్పుడే ఎండలు ముదురుతున్నాయి. టెన్నిస్ కోర్టులా నిగనిగలాడుతున్న తల పైభాగం చురుక్కుమనగానే, తలపై కండువా చుట్టాడు. తలొంచుకొని తన మానాన తాను నడుచుకొంటూ పోతున్నాడు.

మెయిన్ రోడ్‌న తిరిగిపోతే దూరం పెరుగుతుందని... అడ్డ సందుల్లోంచి దూరాడు. జనాలు కూడా పెద్దగా తిరగటం లేదు. ఏదో పరధ్యానంగా ఆలోచించుకుంటూ వెళుతున్న

కా.వే.చ.ను రాసుకొంటూ.. ఓ సైకిలతను ముందుకు సాగిపోసాగాడు. అలా తగులుతూ పోతున్న సైకిలు వంక తలెత్తి చూశాడు.

సందు మలుపు తిరిగేటప్పుడు....సైకిల్‌పై వెళ్లే అతని చేతుల్లోంచి ఏదో పొట్లం జారి క్రిందపడింది. అతను గమనించినట్లేదు.... వెళ్లిపోయాడు.

అది కా.వే.చ. కంటపడింది. వడివడిగా అడుగులు వేసుకొంటూ... వెళ్లి వంగి పొట్లం చేతిలోకి తీసుకున్నాడు. అటు, ఇటూ చూసి రెండడుగులు ముందుకు వేశాడో లేదో "హలో... పెద్దాయనా" అని వెనకనుండి విన్పించగానే, ఉలిక్కిపడి.... వెనక్కి తిరిగి చూశాడు.

"అయ్యా.... పెద్దాయనగారూ! ఆ పొట్లాన్ని నేను కూడా చూశాను. నేను వచ్చేలోగా నీవు తీసుకొన్నావ్! ఆగు... అందులో ఏముందో చూపించు" అన్నాడా వ్యక్తి.

"పొట్లమా.... ఏం పొట్లం...? నా చేతిలోని సంచి క్రిందపడితే వంగి తీసుకొన్నా" అంటూ గంభీరంగా చెప్పి, ముందుకు అడుగు వేయబోయాడు కా.వే.చ.

"మర్యాదగా దొరికిందేదో చూపించు. నేను చూశాను. అది ఏదైనా సరే నాకూ వాటా రావాలి. లేదా నలుగుర్నీ పిలిచి గోల చేస్తాను. నాలుగు తన్ని పోలీసోళ్లకి పట్టిస్తారు...చెప్పు... ఏం చేస్తావ్?" అంటూ బెదిరించాడా వ్యక్తి.

పోలీసోళ్ల మాటెత్తగానే... భయపడి పోయాడు కా.వే.చ.

"ఇదిగో పెద్దాయనా...! నాకే టోకరా వేయాలని చూస్తున్నావే. సైకిలు మీద నుండి పొట్లం జారిపడటం నాకంటితో చూశాను. గబగబా వెళ్లి, దాన్ని తీసుకొని సంచిలో వేసుకొని కూడా.... నన్నే దబాయిస్తున్నావ్...! పొట్లం బయటకి తీసి ఏముందో చూపించు" అంటూ దగ్గరకొచ్చాడా వ్యక్తి.

ఇక తప్పదనిపించి, పొట్లం బయటకు తీయబోయాడు కా.వే.చ.

"ఇక్కడ కాదు. ఇంకెవరైనా చూశారేమో. కొంచెం ముందుకు పద" అన్నాడా వ్యక్తి.

ఇద్దరూ నడుచుకుంటూ ముందుకు సాగారు. కొంచెం నడిచారో లేదో.... సైకిల్‌పై వస్తూ ఒకతను, "అయ్యో.... పెద్దాయనా.... ఏమండీ... ఈ దారిలో మీకేదైనా పొట్లం దొరికిందా?" అంటూ ఆదుర్దాగా అడిగాడు.

"పొట్లమా.... ఏదీ దొరకలేదే..." అన్నాడు. కా.వే.చ.తో పక్కన నడుస్తున్న వ్యక్తి. కా.వే.చ. కూడా తమకేమీ దొరకలేదనట్లు... తలూపాడు. సైకిలు మీది వ్యక్తి కళ్ల నీళ్లు తుడుచుకుంటూ, "ఇరవై గ్రాముల బంగారు గొలుసు. ఇప్పుడే నగల కొట్లోంచి తీసుకు వస్తున్నా..., గొలుసు లేకుండా ఇంటికెళితే... మా ఆవిడ కుళ్లి కుళ్లి చచ్చిపోద్ది" అంటూ, వెతుక్కొంటూ సాగిపోయాడు.

అలా వెళుతున్న అతన్ని చూస్తుంటే... కా.వే.చ.కు గుండె తరుక్కుపోయింది. వెనక్కి పిలిచి ఇచ్చేయాలనిపించింది. చేయి ఎత్తి.... పిలవబోయాడు. వెంటనే ప్రక్కనున్న వ్యక్తి కా.వే.చ. నోరు మూసి, ముందుకు లాక్కు పోయాడు.

"భలేవాడివి పెద్దాయనా...! చేతిలో కొచ్చిన బంగారాన్ని వదిలేసుకోబోతున్నావే...! పద పద... ఈ రోజు నిద్ర లేచి ఎవరి ముఖం చూశామో గాని బంగారు పంట పండింది..." అన్నాడు.

ఇద్దరూ మరికొంత దూరం నడిచి, ఓ టర్నింగ్‌లోని చెట్టు క్రింద నిల్చొన్నారు. పది నిముషాలు ఎవరూ ఏమీ మాట్లాడుకోలేదు. మౌనంగా ఒకర్నొకరు చూసుకొంటూ ఉండి పోయారు.

"ఇదిగో.... నాకు చాలా పస్లున్నాయి. మళ్లీ బస్సు పట్టుకుని ఊరికెళ్లాలి. తొరగా ఏదో ఒకటి కానియ్యి...." అన్నాడు కా.వే.చ. ఓపిక చచ్చిపోయి. ఆ వ్యక్తి తలూపాడు.

"గొలుసు తెంపి చెరి సగం చేసుకొందాం" అన్నాడా వ్యక్తితో కా.వే.చ. మళ్లీ.

"మంచి వస్తువు పాడైపోతుంది. ఎవరో ఒకరం తీసుకుందాం..." అన్నాడు ఆ వ్యక్తి.

"అదెలా కుదరద్ది"

"ఇదిగో పెద్దాయనా...! ఇరవై గ్రాములు అంటున్నాడు కదా! ఎటొచ్చీ పదివేలు చేస్తుంది. నీ దగ్గర సొమ్ముంటే... నాకో అయిదువేలు ఇచ్చెయ్. నగ నీవు తీసుకెళ్లు..."

కా.వే.చ. ఆలోచనల్లో పడినాడు.

ఆ వ్యక్తి చేసే సూచన బాగున్నట్టనిపించింది. మరి తన దగ్గర అయిదువేలు ఉండాలి



రత్నమంజూష

రచన: మాల్యశ్రీ
పుటలు: 60
వెల:15/-
ప్రతులకు: సరిత సాహితి, మొగళ్ళవల్లి, చార్ల పోస్టు, ఖమ్మం జిల్లా, ఆంధ్రప్రదేశ్

చిరుప్రాయంలో చిన్నారులకు పెద్దలు చెప్పే మాటలే వారి భవిష్యత్తుకు పూబాటలుగా మారుతాయి. అదే చేశారు మాల్యశ్రీ. ఈ 60 గేయాలు (ఇవి 1968లో ప్రారంభించి 2003 వరకు కొనసాగినవి) వివిధ పత్రికల్లో, ముఖ్యంగా ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైనవి. వాటిని మనకు పుస్తక రూపంలో అందించారు రచయిత.

తెలుగు వారి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలైన సంక్రాంతితో ప్రారంభించి ఉగాదితో ముగించడం ఒక ప్రత్యేకత. ఇందులో జన్మభూమిపై మమకారాన్ని పెంచుకోవాలని ప్రబోధించే దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అనే గురజాడ వంటి మహనీయుని సూక్తిని తెలియజేయడం కొనియాడదగినది. రచయిత అభినందనీయుడు.

దాదాపు 36 ఏళ్ల క్రితం (ఆరేడు గేయాలు ఇటీవల రాసినవి ఉన్నాయి) రాసినవి అయినా అవి చెరిగిపోనివి, చెదరిపోనివి.

బాలసాహిత్యంలో దిట్టయైన వీరి ఈ గేయాలు బంగారు భవిష్యత్తు వైపు పయనించాలనే బాల బాలికలకు బంగారు బాటలు, బహుతీపి మాటలు.

- గుడిమెట్ల చెన్నయ్య

రేబీస్ వ్యాధి నుంచి రక్షణ సాధ్యమా?



లూయీ పాశ్చర్ 19 శతాబ్దంలో పిచ్చి కుక్క వ్యాధికి వాక్సినేషన్ కనిపెట్టాడు. లక్షలాది మందికి రేబీస్ నుంచి రక్షణ లభించింది. అప్పటి దాకా పిచ్చి కుక్క కరిచాక లక్షణాలు గోచరిస్తే మరి అంతే. దానికి ఇప్పటికీ తిరుగు లేదు. అంటే కుక్క కాటు తరువాత, లక్షణాలు పొడసూపే ముందు ఈ మధ్య కాలంలోనే తగిన రీతిలో వాక్సినేషన్ తీసుకోవాలి. ఈ ముందు జాగ్రత్తకి కూడా గతంలో చర్యలు ఉండేవి కాదు. ఆ తరువాత కూడా దురదృష్ట వశాత్తూ లక్షణాలు కనబడితే మరి గత్యంతరం లేదు.

వాక్సినేషన్ కనిపెట్టిన తరువాత ఇప్పటి వరకూ కొంత మంది 'వ్యాధిగ్రస్థులు' ప్రాణాలు నిలుపుకొన్న దాఖలాలు ఉన్నాయి. అంటే వారు మొదటే కుక్క కాటు ప్రసక్తే లేకుండా వాక్సినేషన్ చేయించుకొన్నవారు, లేదా కుక్కకాటు తరువాత లక్షణాలు కనబడడానికి ముందు వాక్సినేషన్ తీసికొన్నవారు.

అమెరికాలో ఇలాగే అద్భుతం జరిగింది. రేబీస్ వ్యాధి సందర్భంగా ఒక చక్కని మలుపు గోచరించింది.

15 సంవత్సరాల జెన్నా గీస్‌ను ఒక గబ్బిలం కరిచింది. దీని ద్వారా కూడా రేబీస్ సంక్రమిస్తుంది. కానీ ఆ అమ్మాయి సరేలే అని అశ్రద్ధ చేసింది. సుమారు నెల రోజులు పోయాక రేబీస్ లక్షణాలు ప్రారంభమయ్యాయి. అంటే చనిపోవడం తథ్యం.

విస్కాన్‌సిన్‌లో డాక్టర్లు వైద్యంతో జూదం ఆడారు. ఆ అమ్మాయిని వెంటనే కోమాలోకి పోయేలా చేశారు. ఈ విధంగా ఆ లక్షణాలను ఆపగల్గుతామేమోనని!

11 వారాల పాటు హాస్పిటల్‌లో వుంది. తరువాత రోగ లక్షణాలు కనబడలేదు. ఆరోగ్యంగా బయటపడింది. ఇది వైద్య చరిత్రలోనే అద్భుతం.

మానవుల్లో రేబీస్ లక్షణాలు వచ్చాక కూడా నయం చేయవచ్చునా అనేక కోణంలో డాక్టర్లు తమ దృష్టి నిలిపారు.

– జమ్మి కోనేటిరావు

కదా...! సామాన్లకనీ, కూరగాయలకనీ తెచ్చి నవి... నాలుగు వేలు ఉన్నాయి. నగను తాము తీసుకొని... అతన్ని పంపెయ్యాలంటే కనీసం ఇంకో వెయ్యి కావాలి... ఎలా...? పోనీ అయిదు వేలు తీసుకొని... నగని అతనికే వదిలేస్తే సరిపోతుంది...

"ఏంటి... పెద్దాయనా ఆలోచిస్తున్నావ్?" అంటూ అడిగాడు ఆ వ్యక్తి.

తన ఆలోచనలు తెలియచేశాడు కా.వే.చ.

దానికి ఆ వ్యక్తి కూడా కొంచెంసేపు ఆలోచించి, "నేనో ఉపాయం చెప్తా. నీకు ఇష్టం అయితే... అలా చేద్దాం..." అన్నాడు.

తలూపాడు "సరే"నన్నట్లు కా.వే.చ.

"పెద్దాయనా....! నీ దగ్గర నాలుగు వేలన్నా ఉన్నాయి. నా దగ్గరైతే వంద రూపాయలుంది. కాబట్టి నాకెటూ దాని మీద ఆశలేదు. వయసులో పెద్దవాడివి. నీమీద, నీమాట మీద నాకు నమ్మకం ఉంది. కాబట్టి ప్రస్తుతానికి ఆ నాలుగు వేలు ఇచ్చెయ్. నగ నీ వెంట తీసుకెళ్లు. నీ అడ్రస్ ఇవ్వు. వారం రోజులలోగా నేనే మీ ఊరికి వచ్చి, మిగిలిన వెయ్యి రూపాయలు తెచ్చుకుంటాను.. ఏమంటావూ?" అన్నాడా వ్యక్తి.

ఇదేదో బాగుందనిపించింది... కా.వే.చ.కు. రెండు నిముషాలు ఆలోచించుకుని 'సరే' అన్నాడు.

"ఎందుకైనా మంచిది. ఒకసారి పొట్లం తీసి నగ చూసుకో" అన్నాడా వ్యక్తి. మెల్లగా సంచిలోంచి పొట్లం తీసి, చాటుగా చెట్టు ప్రక్కకి తిరిగి, విప్పి చూశాడు. ధగ ధగ మెరిసిపోతూంది గొలుసు. దానిని చూడగానే కా.వే.చ. కళ్లు కూడా మిలమిల మెరిసి పోయాయి.

మళ్లీ పదిలంగా పొట్లం మడిచి, సంచిలో వేసుకొన్నాడు.

చొక్కా వెనక జేబులో చేయి పెట్టి నాలుగు వేలు రూపాయలు బయటకి తీశాడు.

"ఇదిగో బాబూ! నాకు చార్జీ ఖర్చులు కావాలిగా. ఒక వంద తీసుకొంటున్నాను. రేపు వచ్చినప్పుడు అది కూడా కలిపి ఇచ్చేస్తాలే...." అంటూ మిగిలిన కరెన్సీ నోట్లు ఆ వ్యక్తికి ఇచ్చాడు కా.వే.చ.

ఆ వ్యక్తి నోట్లును సీరియస్‌గా లెక్కించు కొని, "మూడు వేల తొమ్మిది వందలు... మిగతా పదకొండొందలు మీ ఊర్లో ఇవ్వాలి" అన్నాడు.

"బలేవాడివయ్యా...! నాది మాటంటే మాటే...! సరిగ్గా వారం రోజులు నాటికి వచ్చెయ్.... సొమ్ము రెడీగా ఉంచుతాను...'

"మీ ఊరు, అడ్రసు చెప్పు మరి..." అంటూ జేబులోంచి కాగితం, పెన్ తీశాడా వ్యక్తి.

"ఇదిగో...! నా అడ్రస్‌కి.... కాగితం, పేనా అక్కర్లేదులేవయ్యా. బస్టాండ్‌లో బస్సెక్కి రామాపురం సెంటర్లో దిగు. పది అడుగులు పడమరకి వచ్చి తలెత్తి చూస్తే.... తాటి కాయంత అక్షరాల్తో, 'పార్వతీ విలాస్, కాఫీ హోటల్' అనే బోర్డుంటది. అదే నా కొంపా, హోటలూ. కనుక్కోవటం పెద్ద కష్టం కాదు" అన్నాడు గలగల నవ్వుతూ కా.వే.చ.

అతను కూడా నవ్వి "సరే... పెద్దాయనా...! వారం రోజుల తర్వాత కలుసుకొందాం. జాగ్రత్తగా వెళ్లు. ఎక్కువసేపు టౌన్లో ఉండొద్దు..." అంటూ జాగ్రత్తలు చెప్పి, చకచక నడుచుకుంటూ వెళ్లిపోయాడు.

ఆ వ్యక్తి అటు వెళ్లగానే... కా.వే.చ. తిరిగి బస్టాండ్ దారి పట్టాడు. కొంతదూరం పోయే సరికి, నగ పోగొట్టుకున్న వ్యక్తి సైకిల్ మీద వస్తూ ఎదురయ్యాడు.

గుండె జల్లుమన్నది కా.వే.చ.కు. అయినా సైకి ఏ మాత్రం కన్పించనీక, నిబ్బరంగా నడవసాగాడు. సైకిలు తన దగ్గరకు రాగానే ఆపాడా వ్యక్తి.

"పెద్దాయనా....! ఇరవై గ్రాముల బంగారు గొలుసు. ఎన్ని రోజులు కష్టపడితే తిరిగి సంపాదించుకోగలను. పోయింది దొరుకుతుందా....?" అన్నాడు.

"నిజమే కదా....! పోగొట్టుకున్నది... తిరిగి దొరకటం అనేది కష్టమే. నీ బాధ చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది బాబూ!..." కళ్లు చెమ్మగిల్లినట్లు నటించాడు కా.వే.చ.

"ఏ దౌర్భాగ్యుడికి దొరికిందో ఏమో...! నా చెల్లెలు పెళ్లికి తయారు చేయించు కొస్తున్నాను. నాలాంటి పేదోడి ఉసురు పోసు కొని వాడేం బాగుపడతాడో...! పోలీసు కంప్లయింట్ కూడా ఇచ్చి వస్తున్నా...! నా సొమ్ము గట్టిదైతే దొరుకుద్ది..." అంటూ సైకిల్ మీద ముందుకు వెళ్లిపోయాడతను.

పోలీసులేమైనా బస్టాండ్‌కి వచ్చి అందరి సంచులు సోదా చేస్తే... తను దొరికిపోతా డేమో! తను చాలా జాగ్రత్తగా ఊరు చేరు కోవాలి...! అనుకుంటూ బస్టాండ్ .చేరుకు న్నాడు. దూరంగా నుండి బాగా పరిశీలిం చాడు. ఎలాంటి హడావుడి కన్పించలేదు. మెల్లగా వెళ్లి ఓ బెంచ్ మీద కూర్చున్నాడు.

మరో పది నిముషాల్లో తమ ఊరికి వెళ్లే బస్సు వచ్చింది. ఎలాగోలా సీటు సంపాదించు కొని ఎక్కి కూర్చున్నాడు. బస్సు కదిలి, టౌను లిమిట్స్ దాటిన తర్వాత తేలిగ్గా ఊపిరి పీల్చుకొన్నాడు. చల్లటి పైరగాలి తగలటంతో చల్లగా ఆలోచనల్లోకి జారాడు.

తను ఈరోజు చేసిన ఘనకార్యానికి సావిత్రి ఎంతగానో మురిసిపోవాలి. తమ ఏకైక కుమార్తె అంజలికి ఈ ఏడాది పెళ్లి చేయా లనుకుంటున్నారు. చాలా చవగ్గా ఒక నగ సంపాదించటం జరిగింది. కొత్తది చేయించా లంటే.... ఎంత లేదన్నా... పది, పన్నెండు వేలు కావాలి. అలాంటిది నాలుగు వేలకే సంపాదించగలిగాడు. వారం రోజుల తర్వాత వస్తాడట...! నవ్వొచ్చింది కా.వే.చ.కు. 'రామాపురం... పార్వతీ విలాస్' తను ఎంత చక్కటి తప్పు అడ్రస్ ఇచ్చాడు...! తన తెలివికి తానే మురిసిపోతున్నంతలో తమ ఊరు సీతాపురం వచ్చింది.

బస్సు దిగి తూర్పు వైపున గల 'లక్ష్మీ విలాస్'లోకి విలాసంగా అడుగుపెట్టాడు.

సామాన్లకి, కూరగాయలకని పట్నం వెళ్లిన పెనిమిటి, సంచీ... సరుకూ లేకుండా చేతులూపుకొంటూ లోపలకు రావటం చూసిన సావిత్రి....అదరాబాదరా హోటల్ గదిలోంచి ఇంట్లోకి వచ్చింది.

"ఇదేంటయ్యా....! అట్టా వెళ్లినోడివి... ఇట్టా చేతులూపుకొంటూ వస్తున్నావు. సరుకులేవీ...?" అంటూ ప్రశ్నించింది పార్వతి.

"తెచ్చాన్లేవోయ్..! ఎందుకింత హడా వుడి..?" అంటూ చిద్విలాసంగా చిరునవ్వుతో, టెన్నిస్ కోర్ట్‌లాంటి తన తలపై సుతారంగా గీరుకొంటున్న కా.వే.చ.ను చూస్తుంటే పార్వ తికి చిర్రెత్తు కొచ్చింది.

"ముందు ఆ చొంగ నవ్వాపి... సరుకెందుకు తేలేదో చెప్పు" తన అసలైన భాషలో అడిగింది పార్వతి.

"అరె... పార్వతీ! ఎందుకే అంత టెన్షన్. ఇదిగో దీన్ని చూడు..." అంటూ సంచిలోంచి పొట్లం తీసి భార్య చేతికిచ్చాడు. ఆదరాబాదరా అందుకొని పొట్లం విప్పి చూసిన పార్వతికి కళ్లు చెదిరాయి.

"ఇదేంటి.... బంగారు గొలుసు...! ఎంతయింది...? ఎక్కడ తెచ్చారు..? అసలేం జరిగింది?" అంటూ ప్రశ్నల వర్షాన్ని కురిపి స్తున్న పార్వతిని కూర్చోబెట్టి....., స్థిమితంగా జరిగిందంతా సినిమా కథలాగా వివరించాడు. ఆమె జరిగిందంతా నమ్మలేనట్లు... ఆశ్చర్యంగా పెనిమిటి వంక చూసింది.

పొట్లాన్ని అలాగే మడిచి... బీరువాలో పెట్టి... హోటల్లోకి వెళ్లింది. కా.వే.చ.కూడా కాళ్లూ, చేతులు కడుక్కోని పనిలో పడి పోయాడు.

పట్నంలో డిగ్రీ చదువుతున్న కూతురు ఏడు గంటల బస్సుకి ఇంటికొచ్చింది. కూతు రెప్పుడొస్తుందా... గొలుసు దాని మెడలో వేసి మురిసిపోదామా... అని ఎదురు చూస్తున్న పార్వతి, కూతుర్ని చూడగానే ఇంట్లో కొచ్చింది.

"అమ్మ అంజలీ...! ఇటు రావే...!" అని పిలిచింది. తల్లి పిలుపుతో దగ్గరకొచ్చిన కుమార్తె చేతికి పొట్లం ఇచ్చింది పార్వతి.

అంజలి పొట్లాన్ని విప్పింది. కళ్లు జిగేల్మనిపించే గొలుసు...! "ఎప్పుడు తెచ్చావే...?" అంటూ గొలుసును పొట్లంలోంచి పైకి తీసింది. అలా చేత్తో పైకెత్తిన అంజలి... "ఈ డూప్లికేటు గొలుసు నాకెందుకే...!" అంటూ విసిరిగొట్టి, రుసరుసలాడుతూ బాత్రూమ్‌లోకి దూరింది.

ఆ మాటతో స్టన్ అయిపోయిన పార్వతి, "అయ్యో!...ఇలా రండి..." అని కా.వే.చ.ని పిలిచింది. పరుగెత్తుకొచ్చాడు. గొలుసు చూపించి, కూతురు అన్న మాటను చెప్పింది.

అప్పటి దాకా పరిశీలనగా చూడని కా.వే.చ., దాన్ని పైకి ఎత్తి అటూ ఇటూ తిప్పి చూశాడు. తేలికగా.... మిల మిల మెరుస్తూ ఉన్న ఆ గొలుసు 'గిల్టునగ' అని అర్థమై పోయింది.

కా.వే.చ. జుట్టు లేని తన తల మీద దబ దబ బాదుకుంటూ ఉంటే... "అక్కడ చూసుకో లేదా...?" అని అడిగింది పార్వతి.

"ఎక్కడ చూసుకొనేదే నా బొంద. ఒకటే టెన్షన్... ఎవరైనా చూస్తారేమోనని. గొలుసు పోగొట్టుకున్న వ్యక్తి.... ఇరవై గ్రాముల గొలుసు పోయిందంటూ... నా ఎదుటే లబలబ కొట్టు కొంటుంటే.... నిజమేనని నమ్మాను..." అంటూ బావురుమన్నాడు.

వెయ్యి రూపాయలు తగ్గించి, తప్పుడు అడ్రస్ ఇచ్చానని మురిసిపోయిన తాను... నిట్ట నిలువునా మునిగిపోయినందుకు కుమిలి కుమిలి ఏడ్చాడు.

నగ పోగొట్టుకొన్నట్లు నటించినతను, నగలో భాగం కావాలని వెంటపడినతనూ, ఇద్దరూ తోడు దొంగలనీ..., కలిసే తనని మోసగించారనీ... పాపం...కా.వే.చ.కి. తెలియదు...! ❋